సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 10 । ఏప్రిల్ । 2025



శునకం.. భయానకం

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎక్కడ చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులపై ఎగబడుతున్నాయి. 8లో ▸



నాటు తుపాకులతో అరెస్ట్

బుట్టాయిగూడెం మండలంలోని గుబ్బల మంగమ్మ గుడి సమీపంలో నాటు తుపాకులతో ఉన్న ముగ్గురిని ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. 8లో ▸



శ్రీహరికోట శిక్షణకు ఎంపిక

శ్రీహరికోట స్పేస్ సెంటర్‌లో శిక్షణా కార్యక్రమానికి తాడేపల్లిగూడెం మండలం దండగర్ర జెడ్పీ పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. 8లో ▸

న్యూస్‌రీల్

స్కానింగ్ కేంద్రాల తనిఖీ



తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ గీతాబాయి

భీమవరం (ప్రకాశంచౌక్): స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. భీమవరంలోని మధు చలపతి యూరాలజీ స్కానింగ్ కేంద్రం, వజ్ర హాస్పిటల్ స్కానింగ్ కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏపీఎంసీఈ యాక్ట్‌లో, పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. లింగ నిర్ధారణపై వాణిజ్య ప్రకటనలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు ప్రోత్సహించేలా గోడ పత్రికలు హోర్డింగులు, వాణిజ్య ప్రకటనలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): బలహీనవర్గాల ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ చదలవాడ నాగరాణి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణ శాఖ ఈఈలు, డీఇలు, ఏఇలు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సొంత ఇల్లు కట్టుకోవాలనేది జీవిత కల అని, వారి కలను మీ ద్వారా నెరవేర్చేందుకు కృషి చేయడం ఎంతో అదృష్టంగా భావించాలన్నారు. కొన్ని మండలాల్లో గృహ నిర్మాణాల పురోగతి చాలా తక్కువగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో ఆర్థికంగా కొంత ఖర్చు పెట్టుకోగలిగిన పరిస్థితి ఉన్నా గృహ నిర్మాణాలలో వేగం ఎందుకు లేదని ప్రశ్నించారు. రానున్న పది రోజుల్లో రాష్ట్రంలో కనీసం 10వ స్థానంలో ఉండేలా కృషి చేయాలని ఆదేశించారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో బుధవారం పీజీఆర్ఎస్, రెవిన్యూ సదస్సులు, రీ సర్వే, ఇళ్ళ పట్టాలు, వాటర్ టాక్స్ తదితర రెవెన్యూ అంశాల ప్రగతిపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ సర్వేయర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ఫిర్యాదులను పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోపుగా పరిష్కరించాలన్నారు. రీ సర్వే పనులను వేగవంతంగా నిర్వహించి, నెలాఖరు నాటికి నోటీసులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సామాజిక సేవ చేయాలి



పోలీస్ క్వార్టర్స్ రామాలయం వద్ద చీరలు పంపిణీ చేస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: పోలీసులు కేవలం శాంతి భద్రతల పరిరక్షణలోనే గాకుండా ప్రజలతో సామాజిక నిబద్ధతతో ముందుకు సాగాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. భీమవరం పట్టణం పోలీస్ క్వార్టర్స్‌లోని రామాలయం వద్ద శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఏర్పాటుచేసిన అన్నదానం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అన్నదానంతో పాటు పోలీసుశాఖ, ఆనంద గ్రూప్ ఆర్థిక సహాయంతో సుమారు 200 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముందుగా ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చరణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలకగా దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎస్పీ పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, డీఎస్పీ రావూరి గణేష్ జయసూర్య, భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు, టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ పాల్గొన్నారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్

భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం 101 మంది విద్యార్థులకు 73 మంది హాజరయ్యారని పరీక్షల నిర్వహణ పర్యవేక్షకుడు బి.సూర్యనారాయణమూర్తి చెప్పారు.

మూల్యాంకనం పూర్తి

భీమవరం: జిల్లాలో నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారంతో ముగిసిందని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. వీరవాసరం ఎంఆర్‌కే జిల్లా పరిషత్ హైస్కూల్లో 1,69,365 సమాధాన పత్రాల మూల్యాంకనంలో 926 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారన్నారు. మూల్యాంకనానికి సహకరించిన ప్రతి ఒక్కరి కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్వా అతలాకుతలం

- క్రాప్ హాలిడేకు సిద్ధమవుతున్న రైతులు
- ధరల పతనంపై తీవ్ర ఆగ్రహం
- రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి కార్యాచరణ
- ఈ నేపథ్యంలో ఉండిలో ఆక్వా రైతుల సమావేశం రద్దు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: అమెరికా సుంకాల భయంతో రొయ్య రేట్లు పతనం కావడంతో రాష్ట్రంలోని ఆక్వా రంగం భవిష్యత్ అయోమయంలో పడింది. కొనుగోలుదారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిరసిస్తూ పశ్చిమ రైతులు పోరుబాట పట్టారు. ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో జూలై నుంచి పంట విరామానికి పిలుపునిచ్చారు. డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు సొంత నియోజకవర్గమైన ఉండిలో బుధవారం జరగాల్సిన ఆక్వా రైతు సదస్సు వాయిదా పడడం చర్చనీయాంశమైంది.

రాష్ట్రంలోని 5.75 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుంటే అత్యధికంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే 2.63 లక్షల ఎకరాల విస్తీర్ణం ఉంది. ఏటా దాదాపు మూడు లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తితో జిల్లా రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉంది. స్థానికం గా 40కు పైగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఉన్నాయి. కిలోకు 20 నుంచి 50 లోపు కౌంట్ రొయ్యలు అమెరికాకు ఎగుమతి అవుతుంటే, 60 నుంచి 100 వరకు కౌంట్ రొయ్యలు చైనా, యూరోపియన్ దేశాలకు ఎగుమతి అవుతుంటాయి. అమెరికాకు రొయ్యల ఎగుమతుల్లో 40 శాతం జిల్లా నుంచే వెళ్తున్నాయి.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహ జ్వాలలు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఈ నెల 7న జై భారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘం ఆధ్వర్యంలో ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాలకు చెందిన రైతులు సమావేశమయ్యారు. ఆక్వా రంగం కుదేలవుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పూలపల్లి వై జంక్షన్ వద్ద రోడ్డెక్కి నిరసన తెలిపారు. జూన్ నెలాఖరుకు పంట ముగించుకుని జూలై నుంచి సెప్టెంబరు వరకు పంట విరామం పాటించాలని సంఘ నాయకులు పిలుపునివ్వగా రైతులు మద్దతు తెలిపారు. ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తం చేసే ప్రయత్నాల్లో రైతు సంఘాల నాయకులు నిమగ్నమయ్యారు. 100 కౌంట్ రొయ్య రూ.220 కొనుగోలు చేయాలని కూటమి ప్రభుత్వం ఎక్స్‌పోర్టర్స్‌కు సూచించడం కంటితుడుపు చర్యగా కొట్టిపారేస్తున్నారు. 100 కౌంట్ దిగుబడికి రూ.240 వరకు ఖర్చవుతుంటే దీని వల్ల నష్టమే తప్ప రైతులకు ప్రయోజనం ఏమీ లేదని చెబుతున్నారు. కిలోకు 50 కౌంట్ లోపు రొయ్యలు మాత్రమే అమెరికాకు వెళ్తుంటే మిగిలిన వాటి ధరలు తగ్గించడాన్ని ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదని రైతు సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

ఉండి సమావేశం రద్దు

అప్సడా ఆధ్వర్యంలో బుధవారం ఉండిలోని కోట్ల ఫంక్షన్ హాలులో ఆక్వా రైతు సదస్సు జరగాల్సి ఉంది. అప్సడా వైస్ చైర్మన్ ఆనం వెంకటరమణ రెడ్డి, ప్రభుత్వ పెద్దలు హాజరై ఆక్వా రైతుల సమస్యలపై చర్చిస్తారని రైతు సంఘాల నాయకులు తెలిపారు. అమెరికా సుంకాల నేపథ్యంలో రొయ్య ధరల స్థిరీకరణ, ముడిసరుకుల ధరలు తగ్గినా మేత ధరలు తగ్గకపోవడం, జోన్లకు సంబంధం లేకుండా సబ్సిడీ విద్యుత్, అధిక లోడు చార్జీల సమస్యల పరిష్కారం, క్రాప్ హాలిడే తదితర అంశాలపై చర్చిస్తారని, కీలకమైన ఈ సమావేశానికి అధిక సంఖ్యలో ఆక్వా రైతులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. అప్సడా, ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ పెద్దలు హాజరయ్యే ఈ సమావేశం వేదికగా ఆక్వా రంగాన్ని ఆదుకోవడంలో కూటమి వైఫల్యాలను ఎండగట్టాలని రైతు సంఘాల నాయకులు భావించారు. అయితే సమావేశం అర్ధాంతరంగా రద్దయ్యింది. అనివార్య కారణాలతో సదస్సు వాయిదా పడినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రకటించారు. ఇప్పటికే జిల్లాలోని మూడు నియోజకవర్గాల రైతులు క్రాప్ హాలీడేకు పిలుపునివ్వడం, ఉండి సమావేశంతో ఆ ప్రభావం మిగిలిన ప్రాంతాలపై పడుతుందన్న ఆందోళనతో సమావేశం రద్దుచేయించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సుంకాల పేరిట దోపిడీ

అమెరికా 26 శాతం పన్నులు విధించడాన్ని సాకుగా చూపించి ఎగుమతిదారులు రొయ్య రేట్లను అమాంతం తగ్గించేశారు. 100 కౌంట్ రూ.235 ఉండగా రూ. 30 నుంచి రూ.40 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఎకరానికి రైతులు టన్నుకు రూ. 40 వేల వరకు నష్టపోవాల్సి వస్తోంది. నెల రోజుల క్రితం వంద కౌంట్ రూ.260 ఉంటే రూ.230కు తగ్గించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆక్వా రైతులు ఆందోళనలు నిర్వహించిన విషయం విదితమే. తాజా పరిణామాల నేపథ్యంలో ఆక్వా రైతులు ప్రభుత్వంపై పోరుబాటకు సిద్ధమవుతున్నారు.

పట్టించుకోవడం లేదు



ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను ఆక్వా హబ్‌గా మారుస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ఇప్పుడు ఆక్వా రైతులు రోడ్డున పడ్డా పట్టించుకోవడం లేదు. ఎక్స్‌పోర్టర్స్ సిండికేట్ అయ్యి ధర తగ్గించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎన్నికల్లో చెప్పినట్టుగా ఆక్వా రంగాన్ని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

– ఆకుల హరేరామ్, ఏపీ రైతు సంఘం నేత, నరసాపురం

పంట విరామమే దిక్కు



50 కౌంట్ లోపు అమెరికాకు ఎగుమతి అవుతుంటాయి. దీనికి సాకుగా చూపించి మిగిలిన వాటి ధరలను దారుణంగా తగ్గించేశారు. ముడిసరుకుల ధరలు తగ్గినా మేత ధరలు తగ్గించడం లేదు. 100 కౌంట్ రూ. 250 ఉంటేనే గాని గిట్టుబాటు కాదు. ఈ పరిస్థితుల్లో ఆక్వా రైతులకు పంట విరామమే శరణ్యం. ఆ దిశగానే ముందుకు వెళుతున్నాం.

– వీరా కుమార్, ఆక్వా రైతు, పాలకొల్లు

సొంతవారికే సోపానం!

- ఏలూరు నగరంలో ఇవ్వనున్న సబ్సిడీ రుణాలు 407
- ఒక్కో డివిజన్‌కు అందుబాటులో 8 'సోపానం' రుణాలు
- డివిజన్ టీడీపీ ఇన్‌చార్జికి 3 చొప్పున కేటాయింపు
- మిగతావి ఎమ్మెల్యే ఆఫీసు నుంచి టిక్ పెడితేనే



ఏలూరులో నిర్వహించిన ఇంటర్వ్యూలు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చంద్రన్న స్వయం ఉపాధి సోపానం పథకం ద్వారా బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్‌కు చెందిన నిరుద్యోగులకు ఉపాధి రుణాలు అందించే కార్యక్రమం సొంతవారికే కట్టబెట్టేలా మారిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వేలల్లో వచ్చినా రుణాలు ఇచ్చేది కొందరికే కావడం ఒక వంతైతే తమ పార్టీ కార్యకర్తలు, నేతలు చెప్పిన వారికే రుణాలు ఇచ్చే కార్యక్రమానికి స్థానిక పచ్చ నేతలు శ్రీకారం చుట్టారు. అర్హత ప్రామాణికంగా ఇవ్వాల్సిన సబ్సిడీ రుణాలను తమకు నచ్చిన వారికి కట్టబెట్టే ప్రహసనంలా మార్చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎవరేమనుకుంటే మాకేంటి.. అధికారం మాది.. మమ్మల్ని అడిగే వారు ఎవరూ లేరనే ధీమాతో టీడీపీ నాయకులు తమకు నచ్చిన విధంగా చేసుకుపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 31 నాటికి మొత్తం 5,847 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను ఈ నెల 3, 4 తేదీలలో స్థానిక ఏఎస్ఆర్ స్టేడియం సమీపంలోని ముస్లిం షాదీఖానాలో దరఖాస్తుల పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇదంతా తూతూ మంత్రంగా నిర్వహించారే తప్ప నిజంగా కార్పొరేషన్ అధికారులు, బ్యాంకు అధికారులకు తమకు నచ్చిన వారికి, అర్హత ఉన్నవారికి సబ్సిడీ రుణాలు ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. అంతా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం నుంచే చక్రం తిప్పారనే విమర్శలు ఉన్నాయి. తమ పార్టీకి చెందిన వారికి, తమకు నచ్చిన వారికే సోపానం పథకంలో రుణాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తుంది.

రుణాల కేటాయింపులు ఇలా..

నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచే రుణాలను కేటాయించినట్లు స్వయంగా టీడీపీ నాయకులే చెబుతున్నారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం 5,847 దరఖాస్తులు రాగా మొత్తం రుణాలు 407 కేటాయించారు. ఒక్కో డివిజన్‌కు సగటున 8 రుణాలు అందించాల్సి ఉంది. ఈ సబ్సిడీ రుణాలు నేరుగా బీసీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు అందజేస్తారు. ఇక్కడే నాయకులు తమకు నచ్చిన వారి పేర్లతో కూడిన లిస్టును తయారు చేసి సంబంధిత అధికారులకు నేరుగా పంపించినట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది నేరుగా జోక్యం చేసుకుని రుణాలను తమదైన శైలిలో పంచారనే వాదనలు ఉన్నాయి.

ఒక్కో ఇన్‌చార్జికి మూడు రుణాలు

ఏలూరు నియోజకవర్గంలోని మొత్తం 50 డివిజన్లకు సంబంధించిన టీడీపీ ఇన్‌చార్జిలు ఒక్కొక్కరికి మూడు చొప్పున రుణాలు కేటాయించారు. మిగిలిన ఐదింటిలో మిత్రపక్షాలైన జనసేన, బీజేపీకి.. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారికి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని నాయకులకు నచ్చిన వారికి ఇచ్చేందుకు అట్టే పెట్టుకున్నారనేది సమాచారం.

అర్హులకు మొండిచేయి?

నిరుద్యోగ యువత తమ కాళ్ల మీద తాము నిలబడి స్వయం ఉపాధి సాధించేందుకు చంద్రన్న స్వయం ఉపాధి సోపానం పేరుతో సబ్సిడీ రుణాలను రాష్ట్ర వ్యాప్తంగా మూడు స్లాబుల్లో అందిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం పేర్కొంది. వాస్తవంగా అదంతా ఉత్తుత్తిదేనని తేలిపోయింది. పేద, బడుగు, బలహీన వర్గాల వారికి అండగా ఉంటామని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని చెప్పి.. సొంత కార్యకర్తలకు ప్రభుత్వ సొమ్మును దోచిపెట్టే కార్యక్రమం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● మేఘం కమ్మేసింది



ఉదయం నుంచి సాయంత్రం వరకు మండే ఎండతో అల్లాడిన ఏలూరు నగర ప్రజలు సాయంత్రం చల్లగాలులకు సేదదీరారు. ఒక్కసారిగా కారు మబ్బులు కమ్మేశాయి. బుధవారం సాయంత్రం ఏలూరు నగరంలో ఈ దృశ్యం కనువిందు చేసింది. - సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు

రియల్.. ఢమాల్

- కూటమి పాలనలో పడకేసిన రియల్ ఎస్టేట్
- నిలిచిన క్రయవిక్రయాలు.. జిల్లాలో తగ్గిన రిజిస్ట్రేషన్లు
- పడిపోయిన రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం
- గతంలో 70 శాతానికి పైగా ఆదాయం
- కూటమి పాలనలో గత ఏడాది 63 శాతానికి తగ్గుదల



సాక్షి, భీమవరం: జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఏడాది కాలంగా క్రయవిక్రయాలు తగ్గిపోయి రిజిస్ట్రేషన్ల శాఖ లక్ష్యాన్ని చేరుకోవడం గగనంగా మారింది. కరోనా విలయతాండవం సమయంలో సైతం లేని గడ్డు పరిస్థితులు కూటమి పాలనలో ఎదురవుతున్నాయి. రిజిస్ట్రేషన్ చార్జీలను ప్రభుత్వం అడ్డగోలుగా పెంచడం ఈ రంగాన్ని మరింత కుంగదీస్తోంది. పిల్లల చదువులు, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం పట్టణ జీవనం కోరుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. స్థానికంగా స్థిర నివాసం ఏర్పరుచుకునేందుకు వారు ఆసక్తి కనబర్చేవారు. జిల్లాలోని పట్టణ, మండల కేంద్రాలు, సమీప గ్రామాల్లో సుమారు రెండు వేల వరకు లే అవుట్లు వెలిశాయి. ఎక్కడికక్కడ అపార్ట్‌మెంట్లు పుట్టుకొచ్చాయి. స్థలాలు, ప్లాట్ల క్రయ విక్రయదారులతో కొన్నేళ్ల పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కళకళలాడాయి. 2019 నుంచి 2024 మధ్యకాలం స్థిరాస్తి రంగానికి స్వర్ణ యుగంగా మారింది. విద్య, వైద్య రంగంలో గత ప్రభుత్వం అండగా నిలవడంతో ప్రజల జీవన వ్యయం తగ్గింది. అన్ని వర్గాల వారికి మేలుచేసేలా అమలుచేసిన సంక్షేమ పథకాలు వారి ఆదాయాన్ని మరింత పెంచాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడం, వ్యవసాయం, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాల రూపంలో ప్రభుత్వం అండగా నిలవడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడి స్థిరాస్తి రంగంలో కొనుగోళ్లు పెరగాయి. గత ఐదేళ్లలో ఏటా ప్రభుత్వం నిర్దేశించిన రాబడి లక్ష్యం 70 శాతానికి తగ్గలేదు. కరోనా విలయతాండవం చేసిన 2020, 2021 సంవత్సరాల్లో సైతం 76 నుంచి 95 శాతం వరకు లక్ష్యాన్ని చేరుకోవడం గమనార్హం.

స్థిరాస్తి రంగం కుదేలు :

కూటమి పాలనలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. గతంలోని వెంచర్లు, అపార్ట్‌మెంట్లపై కొన్నిచోట్ల కూటమి నేతలు రాబందుల్లా పడ్డారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. వర్షాలు, వరదలు, దళారుల దోపిడీలతో తొలకరి పంట నష్టపోగా, గిట్టుబాటు ధరలు లేక ఆక్వా సాగు నిరాశజనకంగా తయారైంది. సంక్షేమ పథకాలను ప్రభుత్వం అటకెక్కించడంతో జనం వద్ద డబ్బులేక మార్కెట్‌లో మనీ రొటేషన్ తగ్గిపోయింది. దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండుగల్లో రెడీమేడ్, కిరాణా, బంగారం, ఫ్యాన్సీ, హోమ్‌నీడ్స్ తదితర వ్యాపారాలు సగం కూడా జరగని పరిస్థితి ఎదురైంది. రియల్ ఎస్టేట్ రంగంలో క్రయవిక్రయాలు తగ్గిపోయాయి. సైట్లు అమ్ముడుపోక అప్పులు చేసి వెంచర్లు వేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పిల్లల చదువులు, వివాహాలు, ఇతర అవసరాల నిమిత్తం ఉన్న కాస్త ఆస్తిని అమ్మకానికి పెట్టినా కొనేవారు లేక సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో నెలకు రెండు మూడు ప్లాట్లు విక్రయించే వారు గత కొన్ని నెలలుగా ఒక్క ప్లాటు కూడా విక్రయించలేని పరిస్థితి.

తగ్గిన ఆదాయం

ముందెన్నడూ లేని విధంగా రిజిస్ట్రేషన్ శాఖలో గత ఆర్థిక సంవత్సరంలో రాబడి లక్ష్యం 63 శాతం నమోదైంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి భూముల విలువను 10 నుంచి 40 శాతం వరకు పెంచడం రియల్ ఎస్టేట్ రంగాన్ని దెబ్బతీసింది. గత ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో 17,394 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 67.7 కోట్లు ఆదాయం సమకూరగా ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో 15,645 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.58.07 కోట్ల ఆదాయం వచ్చింది. భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెరగడం, ప్రజలు బంగారం కొనుగోలుకు ఆసక్తి చూపడం వల్ల రిజిస్ట్రేషన్లు తగ్గాయని అభిప్రాయపడుతున్నారు.

గత ఐదేళ్లలో జిల్లాలోని రిజిస్ట్రేషన్ల వివరాలు

సంవత్సరం	రిజిస్ట్రేషన్లు	ఆదాయం లక్ష్యం (రూ.కోట్లలో)	వచ్చిన మొత్తం (రూ.కోట్లలో)	శాతం
2020-21	85,620	318.9	241.26	76
2021-22	1,23,536	365.59	361.68	99
2022-23	1,39,731	486.79	380.37	78
2023-24	1,83,180	517.13	399.66	70
2024-25	98,790	616.76	388.22	63

గత ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల వివరాలు

కార్యాలయం	రిజిస్ట్రేషన్లు	ఆదాయం లక్ష్యం (రూ.కోట్లలో)	వచ్చిన మొత్తం (రూ.కోట్లలో)	శాతం
తాడేపల్లిగూడెం	15,257	81.85	54.03	66.01
అత్తిలి	5,537	22.45	14.60	65.07
ఆచంట	3,417	13.82	9.21	66.67
ఆకివీడు	4,097	25.83	14.17	54.86
భీమవరం	10,867	12.30	68.98	56.07
మొగల్తూరు	7,451	20.84	19.00	91.14
నరసాపురం	7,024	42.20	23.21	55.01
పాలకొల్లు	9,328	54.14	37.19	68.70
పెనుగొండ	4,437	19.70	11.70	59.41
పెంటపాడు	2,666	12.12	9.04	74.57
తణుకు	9,323	64.98	39.20	60.33
ఉండి	3,988	14.16	15.66	110.58
వీరవాసరం	3,653	18.86	9.21	48.83
గునుపూడి	5,208	63.88	35.05	54.88
సజ్జాపురం	6,537	38.83	27.89	71.84
మొత్తం	98,790	616.76	388.22	63

ఒంటిమిట్టకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

తణుకు అర్బన్: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 11న కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండస్వామి ఆలయంలో నిర్వహించనున్న శ్రీ సీతారామస్వామి కల్యాణ మహోత్సవ దర్శనానికి భక్తుల సౌకర్యార్థం తణుకు డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని, టికెట్ ధర పెద్దలకు రూ. 1030, పిల్లలకు రూ. 570గా నిర్దేశించినట్లు చెప్పారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల 10న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కోర్టులున్న అన్ని ప్రదేశాలలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2025లో నాలుగు జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఈ సంవత్సరం రెండో జాతీయ లోక్ అదాలత్ మే 10న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్, సివిల్ కేసులు, కుటుంబ వివాదాల కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, టెలిఫోన్ బకాయిల కేసులు, బ్యాంకు లావాదేవీల కేసులు వంటివి పరిష్కరిస్తారని చెప్పారు. రాజీకి అనుకూలంగా ఉండి పరిష్కారం కాని కేసులను పర్మినెంటు లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ద్వారా మధ్యవర్తిత్వం నిర్వహించి రాజీ చేస్తారని తెలిపారు. అన్ని కోర్టుల పరిధిలో ప్రీ సిట్టింగ్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కేసులనుంచి విముక్తి పొందగలరని సూచించారు. కేసులను పరిష్కరించుకోవడంలో సమస్యలు ఉంటే 15100 లేదా 08812 224555కు ఫోన్ చేసి సమస్యల పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

క్లుప్తంగా

నాటు తుపాకులతో ముగ్గురి అరెస్ట్



తెలంగాణ ఫారెస్ట్ అధికారులకు నాటు తుపాకులతో పట్టుబడ్డ గిరిజన యువకులు

బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మ గుడి సమీపంలోని అటవీప్రాంతంలో నాటు తుపాకులతో కనిపించిన ముగ్గురు గిరిజనులను అరెస్ట్ చేసినట్లు తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి మామిడిశెట్టి మురళి తెలిపారు. నిందితులను కావిడిగుండ్ల, కంట్లం బేస్ క్యాంప్ సిబ్బంది పట్టుకుని, వారి వద్ద ఉన్న రెండు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. విచారణలో నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సరిహద్దులో ఉన్న బుట్టాయగూడెం మండలం కామవరంనకు చెందిన రవి, మంగబాబు, నవీన్‌గా గుర్తించినట్లు చెప్పారు. అడవి జంతువులను నాటు తుపాకులతో వేటాడేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో ఈ ముగ్గురు మా సిబ్బందికి పట్టుబడ్డారని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్



చోరీ కేసుల్లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు

తాడేపల్లిగూడెం: భీమవరం రైల్వే సర్కిల్‌లో పలు చోరీలకు పాల్పడిన నిందితుడిని రైల్వే పోలీసులు బుధవారం అరెస్టు చేసి, అతని వద్ద నుంచి సెల్‌ఫోన్లు, బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను గూడెం రైల్వే పోలీసు స్టేషన్‌లో విలేకర్లకు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా సింగవరం గ్రామానికి చెందిన ఉలవలపూడి దుర్గారావు అనే వ్యక్తి రైళ్లలో పలు చోరీలకు పాల్పడ్డాడు. విజయవాడ రైల్వే డీఎస్పీ జి.రతన్‌రాజు ఆదేశాల మేరకు భీమవరం రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సోమరాజు, గూడెం రైల్వే ఎస్సై పి.అప్పారావు టీమ్‌గా ఏర్పడి నిందితుడిని నిడదవోలు కొత్త ఫ్లై ఓవర్ వంతెన వద్ద పట్టుకున్నారు. అతని వద్ద నుంచి చోరీ సొత్తు 18 సెల్‌ఫోన్లు, సుమారు 30 గ్రాముల బంగారం వెరశి మొత్తం రూ.3 లక్షల 70 వేల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు.

ఐటీఐ ట్రేడ్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: రాష్ట్ర ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెనింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేటుగా ఐటీఐ ఆల్ ఇండియా ట్రేడ్ పరీక్ష రాసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో అందజేయాలన్నారు. వివరాలకు 96760 99988 నంబర్లో సంప్రదించాలని కోరారు.

శునకం.. భయానకం

- ప్రతి వీధిలోనూ కుక్కల బెడద
- హడలిపోతున్న ప్రజలు
- కానరాని కుక్కల కుటుంబ నియంత్రణ కార్యక్రమం



ఏలూరు పవరు పేటలోని ఒక వీధిలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): ఎక్కడ చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రతి పంచాయతీ, పట్టణం, నగరంలోని ప్రతి వీధిలోనూ కుక్కల బెడద ఎక్కువ కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు హడలిపోతున్నారు. ప్రధానంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులపై వీధికుక్కలు ఎగబడుతున్నాయి. కుక్కల నుంచి తప్పించుకునేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్లపై ఇష్టానుసారంగా సంచరిస్తున్న వీధి కుక్కల నుంచి తమను కాపాడాలంటూ ప్రజలు పలుసార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. అనేక సందర్భాలలో కుక్కల దాడిలో గాయపడటం, వాహనాల మీద నుంచి పడిపోవడం వంటి ఘటనలు అనేకం జరిగాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటుకు సంబంధించిన ఇంజెక్షన్లు అందుబాటులోకి లేకపోవడంతో ప్రైవేటు వైద్య శాలలను ఆశ్రయించాల్సి వస్తుందని పలువురు చెబుతున్నారు. కుక్కలు కరిచాక పరుగులు తీసే కన్నా వాటి బారి నుంచి ప్రజలను కాపాడేందుకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందిగా ముక్త కంఠంతో కోరుతున్నారు.

జిల్లాలో 25 వేల వరకు పెంపుడు కుక్కలు

జిల్లా వ్యాప్తంగా 547 గ్రామ పంచాయతీలు, నూజివీడు, జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలు, ఏలూరు కార్పొరేషన్ పరిధిలో దాదాపు 25 వేల వరకు పెంపుడు కుక్కలు ఉన్నట్లు పశు వైద్యాధికారులు చెబుతున్నారు. ఇంతే సంఖ్యలో వీధి కుక్కలు సైతం గ్రామాలు, పట్టణాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. పెంపుడు కుక్కలతో పెద్దగా సమస్య లేకపోయినప్పటికీ వీధి కుక్కల పేరు చెబితే చాలు ప్రజలు హడలిపోతున్నారు. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని మొత్తం 50 డివిజన్ల పరిధిలో 1900 నుంచి 2వేల వరకు వీధి కుక్కలు ఉన్నట్లు



ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతంలో మెడికల్ షాపు వద్ద హడలెత్తిస్తున్న వీధి కుక్కలు (ఫైల్)

నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో కుక్కలు తిరుగుతున్నా వాటి బెడద నుంచి రక్షించడానికి అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అందుబాటులో 35 వేల యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు

ఏలూరు జిల్లా వ్యాప్తంగా 35 వేల యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నట్లు పశు వైద్యాధికారులు చెబుతున్నారు. జిల్లాలోని 66 పశు వైద్యశాలలు, 11 ప్రాంతీయ పశు వైద్యశాలలు ఉండగా వీటి పరిధిలో ఒక్కో దానిలో 500 చొప్పున యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచామన్నారు. అయితే జిల్లాలోని కుక్కల సంఖ్యకు అనుగుణంగా యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు అందుబాటులో లేకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. జూలై నెలలో వచ్చే యాంటీ రేబీస్ దినోత్సవం సందర్భంగా అన్ని పశువైద్యశాలలో పెద్ద ఎత్తున యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌లు వేయనున్నారు. ప్రైవేట్ కుక్కలకు వ్యాక్సిన్లు వేయించినా, వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ జరగడం లేదని, దీంతో అవస్థలు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పట్టించుకోవడం లేదు



వీధి కుక్కల బారి నుంచి ప్రజలకు ముఖ్యంగా పిల్లలు, వృద్ధులకు రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు అందించాం. ఎక్కడెక్కడ కుక్కలు అధికంగా ఉన్నాయో అనే వివరాలను అందజేశాం. కుక్కల బెడదను నివారించే చర్యలు తీసుకుంటామంటూ చెబుతున్నారే తప్ప ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

– ఏ.రాణి, జిల్లా కార్యదర్శి, ఐద్వా, ఏలూరు

చర్యలు తీసుకుంటున్నాం



వీధికుక్కల సంతానం అభివృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవలే దీనికి సంబంధించిన కేంద్రాన్ని ప్రారంభించాం. హర్యానాకు చెందిన స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు, యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఏ.భాను ప్రతాప్, కమిషనర్, నగరపాలక సంస్థ, ఏలూరు

పశువైద్యశాలలో యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు



జిల్లాలోని ప్రతి పశువైద్యశాల, ప్రాంతీయ పశువైద్యశాలల్లో యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. దాదాపు 25 వేల వరకు ఇంజెక్షన్లు సిద్ధంగా ఉంచాం. ఎవరైనా ఆస్పత్రికి వచ్చి ఇంజెక్షన్ అడిగితే ఉచితంగా అందించేందుకు ఏర్పాటు చేశాం. జిల్లాలో 40వేలకు పైగా పెంపుడు, వీధి కుక్కలు ఉండగా వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

– టి.గోవిందరాజు, ఇన్‌చార్జి జేడీ, పశుసంవర్ధక శాఖ, ఏలూరు జిల్లా

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



నిట్ క్రీడా సంబరాల్లో పాల్గొన్న క్రీడాకారులు

తాడేపల్లిగూడెం: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అర్జున అవార్డు గ్రహీత, జాతీయ కబడ్డీ క్రీడాకారిణి రీతూ నేగి అన్నారు. ఏపీ నిట్‌లో బుధవారం ఆమె వార్షిక క్రీడాసంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రీతూ నేగి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించి అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తాను 17 సంవత్సరాల నుంచి కబడ్డీ ఆడుతున్నానని, దేశం తరుపున ఆడటాన్ని గర్విస్తున్నానన్నారు. 2022లో ఆసియా క్రీడల్లో భారతీయ కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడంతో పాటు స్వర్ణపతకం సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. గౌరవ అతిథి ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు ఫోన్లకే పరిమితం కాకుండా కొంత సమయాన్ని క్రీడలకు కేటాయిస్తూ శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. క్రికెట్ క్రీడా చరిత్రలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సచిన్, ధోని స్ఫూర్తితో అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. గౌరవ అతిథి కబడ్డీ క్రీడాకారిణి పింకీ రాయ్ మాట్లాడుతూ క్రీడలపై మక్కువతో సాధనచేస్తే ప్రతిఫలం తప్పకుండా దక్కుతుందన్నారు. నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి, డీన్‌లు రవికిరణ్‌శాస్త్రి, వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్‌లు శ్రీనివాసన్, రాజేశ్వరరెడ్డి, కిరణ్ తీపర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరికోట శిక్షణకు దండగర్ర విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో మే 18 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న శిక్షణా కార్యక్రమానికి తాడేపల్లిగూడెం మండలం దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు మైనం ప్రదీప్తి, వీరమళ్ల పద్మశ్రీ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్ఎస్) సంయుక్తంగా దేశ వ్యాప్తంగా తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ప్రధానంగా ఉపగ్రహాలు, రాకెట్ల తయారీ, క్రయోజెనిక్ టెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, మినరాలజీ మ్యాపింగ్, డీప్ స్పేస్ నెట్ వర్క్, రేడియో టెలిమెట్రి ట్రాకింగ్, లాండర్స్, రోవర్లు, స్పేస్ ప్రోబ్స్, గగన్యాన్ వంటి వాటిపై శాస్త్రవేత్తలతో ముఖాముఖీ, శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. దేశ వ్యాప్తంగా 1.50 లక్షల మంది రిజిస్ట్రేషన్ కాగా, 350 మందిని ఇస్రో ఎంపిక చేసిందన్నారు. వీరిలో తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.



హెచ్ఎం చంద్రశేఖర్‌తో ఇస్రో శిక్షణకు ఎంపికైన విద్యార్థినులు ప్రదీప్తి, పద్మశ్రీ

పిల్లల దొంగలంటూ ఆస్పత్రిలో కలకలం

- ఫోన్ చార్జింగ్ పెట్టుకోవడానికి ఆస్పత్రికి వచ్చానన్న మహిళ
- పొంతన లేని సమాధానాలతో ఇద్దరు మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలింపు

తణుకు అర్బన్ : తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పిల్లలను దొంగిలించే మహిళలు దిగారన్న వార్త కలకలం రేపింది. నిమిషాల వ్యవధిలోనే పిల్లల దొంగలు ఆస్పత్రిలో ఉన్నారనే విషయం ఆనోట ఈనోట విన్న బాలింతలు, తల్లులు బెంబేలెత్తిపోయారు. కామెర్లు, ఇతర సమస్యలతో ఎన్‌సీయూ విభాగంలో ఉంచిన తమ బిడ్డ ఉందా అనే భయంతో బాలింతల బంధువులు వార్డు వద్దకు పరుగులు పెట్టారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం సుమారు 10 గంటల సమయంలో ఆస్పత్రి మూడో అంతస్తులోని ఏసీ వార్డులో ఉన్న బాలింతల వద్దకు వచ్చిన ఒక మహిళ తన ఫోన్ చార్జింగ్ పెట్టుకుంటానని అడిగి చార్జింగ్ పెట్టుకుంది. పిచ్చాపాటిగా మాట్లాడుతూ ఒక బాలింత మంచంపై ఉన్న కవల పిల్లల్లో ఒక బిడ్డను ఎత్తుకుంటానని అడగ్గా ఆ తల్లి ఒప్పుకోలేదు. అయితే సదరు మహిళ అనుమానాస్పదంగా కనిపించడంతో బాలింత వార్డులోని నర్సుకు సమాచారం ఇచ్చారు. నర్సు ఇచ్చిన సమాచారంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ సెక్యూరిటీ విభాగాన్ని అప్రమత్తం చేశారు. సెక్యూరిటీ సిబ్బంది రావడం చూసిన మహిళ పరిగెత్తుతూ పారిపోతున్న పరిస్థితుల్లో ఆస్పత్రి గేటు వద్ద అదుపులోకి తీసుకుని సూపరింటెండెంట్ వద్దకు తీసుకువెళ్లి పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ దశలో మరోమారు పారిపోయేందుకు ప్రయత్నించినా సెక్యూరిటీ విభాగ సూపర్‌వైజర్ సాయి, మహిళా సెక్యూరిటీ రేణుక ఆ మహిళను పట్టుకుని తిరిగి లోపలకు తీసుకువెళ్లారు. తణుకు పట్టణ స్టేషన్ ఏఎస్సై రాజ్యలక్ష్మి, కానిస్టేబుల్ మురళి వచ్చిన తరువాత మహిళను ప్రశ్నించగా సమీపంలో ఉన్న ఆమె బంధువుకు ఫోన్‌చేసి రప్పించారు. అయితే ఇద్దరూ కలసి నిడదవోలు మండలం కంసాలపల్లి నుంచి వచ్చామని సామాన్లు కొనుక్కునేందుకు వచ్చి ఫోన్ చార్జింగ్ పెట్టుకోడానికి ఆస్పత్రికి వచ్చానని చెప్పడంతో పాటు పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో ఇద్దరు మహిళలను పోలీసువర్గాలు పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే కొవ్వూరు మండలం శెట్టిపేటకు చెందిన గ్రామ పెద్దలు వచ్చి మహిళలు అటువంటి వారు కాదని ఆధార్ కార్డులు చూపించి సొంత పూచీకత్తుపై మహిళలను స్టేషన్ నుంచి తీసుకువెళ్లారని పోలీసులు తెలిపారు.



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఇద్దరు మహిళలను స్టేషన్‌కు తీసుకువెళ్తున్న ఏఎస్సై రాజ్యలక్ష్మి

దళితులపై దౌర్జన్యాలు అరికట్టాలి

జంగారెడ్డిగూడెం: దళితులపై కూటమి నాయకుల దౌర్జన్యాలు అరికట్టాలని కేవీపీఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. వేగవరంలో సీపీఎం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ దళిత మహిళ గంజి మరియమ్మ 30 ఏళ్లుగా వేగవరంలో అరటిపండ్లు, కొబ్బరి బొండాలు అమ్ముకుంటూ జీవిస్తోందన్నారు. షాపు తీసివేయాలని కూటమికి చెందిన జనసేన నాయకులు అనిశెట్టి వెంకన్నబాబు, దాకవరపు భానుమూర్తి, మోటేపల్లి దదార్ల, దాకవరపు వీరనాగయ్య కొందరితో కలిసి ఆమెపై దౌర్జన్యం చేశారన్నారు. తమ జీవనోపాధిని కూలగొట్టద్దని మరియమ్మ వేడుకున్నా షాపులను తొలగించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. కూటమి నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ వేగవరంలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని జీవిస్తున్న దళితులపై కక్ష సాధింపు చర్యలు చేస్తున్న కూటమి నాయకులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో చలో వేగవరానికి పిలుపునిచ్చి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితులు కె.సుబ్బారావు, గంజి మరియమ్మ, కృష్ణ, రామారావు, బుడుపుటి నిర్మల కుమారి, నంబూరి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



వేగవరంలో ధర్నా చేస్తున్న సీపీఎం, కేవీపీఎస్ నాయకులు

'గోదారి గట్టుపైన' చిత్ర షూటింగ్ సందడి



వేల్పూరులో నటుడు జగపతిబాబు

తణుకు అర్బన్: 'గోదారి గట్టుపైన' చిత్రం షూటింగ్ తణుకు మండలం వేల్పూరులో సందడి చేసింది. గత రెండురోజులుగా చిత్రీకరిస్తున్న ఈ సినిమాలో బుధవారం ప్రముఖ నటుడు జగపతిబాబు వేల్పూరు రహదారులపై హల్‌చల్ చేశారు. ముఖ్యంగా వేల్పూరు ప్రధాన రహదారిపై జగపతిబాబు ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ప్రయాణిస్తున్నట్లుగా పలు సన్నివేశాలు చిత్రీకరించారు. చిత్రంలో హీరో సుమంత్ ప్రభాస్‌తోపాటు జగపతిబాబుతో కలిపి కొన్ని సన్నివేశాలను తణుకు చుట్టుపక్కల గ్రామాల్లో కొంతకాలంగా చిత్రీకరిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

హోటళ్లపై విజిలెన్స్ తనిఖీలు



తనిఖీల్లో అధికారులు

తాడేపల్లిగూడెం: రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (ఏలూరు) ఆదేశాల మేరకు పట్టణంలో బుధవారం వివిధ హోటళ్లను విజిలెన్స్, ఆహార తనిఖీ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. శ్రీరామదూత ఫుడ్ వేవ్స్ రెస్టారెంట్, మెస్సెర్స్ అన్ లిమిటెడ్ మల్టీ కుజిన్ రెస్టారెంట్, మెస్సెర్స్ దేవి డాల్ఫిన్ రెస్టారెంట్ (కొండ్రుపోలు)లో తయారు చేసి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. కృత్రిమ రంగులు కలిపినట్లుగా అనుమానంతో రావడంతో నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. తనిఖీల్లో ఎస్సై సీహెచ్ రజిత్ కుమార్, ఏఓ జి.మీరయ్య, సుందర రామిరెడ్డి పాల్గొన్నారు.

భార్యాభర్తల తగాదా.. భర్త ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: భార్యా భర్తల మధ్య ఏర్పడిన తగాదా కారణంగా భర్త ప్రాణం తీసుకున్న ఘటన పాలకొల్లులో జరిగింది. వివరాల ప్రకారం పట్టణంలోని 28వ వార్డుకు చెందిన కె సతీష్ (22) మూడు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. మంగళవారం భార్యాభర్తల మధ్య తగాదా ఏర్పడింది. దీంతో మనస్తాపానికి గురైన సతీష్ బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు సతీష్‌ను పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జీజే ప్రసాద్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


15న కోకో రైతుల చలో గుంటూరు



మీడియా సమావేశం నిర్వహిస్తున్న కోకో రైతులు

పెదవేగి : కోకో గింజల కొనుగోలు, ధర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏపీ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పెదవేగి మండలం విజయరాయి గాంధీ నగర్‌లోని సీతారామ కళ్యాణ మండపంలో ఏపీ కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన కోకో రైతుల సంఘం రాష్ట్ర సమావేశం నిర్వహించారు. కోకో గింజల కొనుగోలు కంపెనీల మోసాలు, కొనుగోలు ధరల తగ్గింపుపై ఈనెల 12న కోకో సాగు చేస్తున్న అన్ని జిల్లాల్లో రాస్తారోకో కార్యక్రమాలు, 15న కోకో రైతుల చలో గుంటూరు ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర సమావేశం తీర్మానించింది. కోకో రైతులందరూ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి కేసులో తనుశ్రీ భర్త అరెస్ట్



మధ్యవర్తుల సమక్షంలో అనిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుంటున్న డీఎస్పీ

ముదినేపల్లి రూరల్ : వడాలికి చెందిన తనుశ్రీ అనుమానాస్పదస్థితి మృతి కేసులో ఆమె భర్త అనిల్ కుమార్‌ను డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ముదినేపల్లిలో బుధవారం అరెస్టు చేశారు. గుండాబత్తిన తిరుపతయ్య కుమార్తె తనుశ్రీని అదే గ్రామానికి చెందిన బెజవాడ అనిల్‌కుమార్ ఐదు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకోగా ఈ నెల 7న తనుశ్రీ అనుమానాస్పద స్థితిలో మరణించింది. దీనిపై తనుశ్రీ బంధువులు, గ్రామస్తులు ఆగ్రహించి భర్త అనిల్‌కుమార్ హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడని, వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వడాలిలో మంగళవారం మూడు గంటలపాటు ధర్నా నిర్వహించారు. దీనిపై స్పందించిన డీఎస్పీ సిబ్బందితో అనిల్‌కుమార్‌ను స్థానిక సహాయమాత స్కూల్ వద్ద బుధవారం అరెస్టు చేసి మధ్యవర్తుల సమక్షంలో పంచనామా చేసి కైకలూరు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో నెల్లూరు జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిందని భర్త ఆత్మహత్య

భీమవరం: కట్నం కోసం వేధిస్తున్నాడంటూ భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మనస్తాపం చెందిన ఓ భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భీమవరంలోని బలుసుమూడిలో జరిగింది. టూటౌన్ ఎస్సై ఇబ్రాయల్ తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం ఉప్పులూరు గ్రామానికి చెందిన కె నాగరాజు(29)కు సుధారాణితో వివాహం కాగా వీరు కొంతకాలం పాలకొల్లులో కాపురం పెట్టారు. వీరిద్దరి మధ్య విభేదాలు రావడంతో సుధారాణి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ నాగరాజుపై పాలకొల్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తరువాత లోక్ అదాలత్‌లో కేసును రాజీచేసుకుని మూడేళ్ల క్రితం బలుసుమూడిలో కాపురం పెట్టారు. అయితే ఇరువురి మధ్య గొడవలు తిరిగి పునరావృతం కావడంతో ఈనెల 8వ తేదీన భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ సుధారాణి ఫిర్యాదు చేసింది. దీంతో మనస్తాపం చెందిన నాగరాజు ఇంటిలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై నాగరాజు తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇబ్రాయల్ చెప్పారు.

నిషేధిత మందుల విక్రయాలపై కేసు నమోదు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్న ఓ అక్రమ ఏజెన్సీని గుర్తించి కేసు నమోదు చేసినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బి మల్లిఖార్జునరావు తెలిపారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు మాట్లాడుతూ స్థానిక కటికల వీధిలో నివాసం ఉంటున్న జి చంద్రశేఖరరావు అనే వ్యక్తి లైసెన్స్ లేకుండా అబార్షన్ కిట్లు, వయాగ్రా టాబ్లెట్స్, అన్‌వాంటెడ్ 72 (ప్రెగ్నెన్సీ రాకుండా మందులు) ఇలా అనుమతులు లేని 11 రకాలు మందులు ఇంటిలో పెట్టుకుని హోల్‌సేల్‌గా అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. వీటి విలువ సుమారు రూ.16 వేలు ఉంటుందన్నారు. విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని, నేడు కోర్టులో హాజరు పరచనున్నట్లు వివరించారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ బాలాజీ, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిషేధిత మందులను పట్టుకున్న అధికారులు

పీజీ విద్యార్థి అనుమానాస్పద మృతి

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మానూరు గ్రామానికి చెందిన తాడిశెట్టి వెంకటేష్ (24) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వెంకటేష్ రాజమండ్రి నన్నయ్య యూనివర్సిటీలో ఎమ్మెస్సీ అగ్రికల్చర్ (పోస్ట్ గ్రాడ్యుయేషన్) కోర్సు చేస్తున్నాడు. మంగళవారం రాజమండ్రి నుంచి స్వగ్రామానికి వచ్చాడు. రాత్రి కుటుంబ సభ్యులందరితో సంతోషంగా గడిపాడు. బుధవారం తెల్లవారుజామున చూసేసరికి అపస్మారక స్థితిలో ఉన్నాడు. కుటుంబ సభ్యులు ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు అతన్ని పరీక్షించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలవరంలో ఆక్టోపస్ మాక్ డ్రిల్

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో ఆక్టోపస్ పోలీస్ బృందం మాక్ డ్రిల్ నిర్వహించారు. పోలీసు శిక్షణలో భాగంగా ప్రాజెక్టు ప్రాంతాన్ని బుధవారం సందర్శించారు. ప్రాజెక్టు భద్రతా చర్యల్లో భాగంగా ప్రాజెక్టు ప్రాంతంలోని పలుచోట్ల మాక్ డ్రిల్ నిర్వహించినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. ఐజీపీ (ఆపరేషన్స్)లో భాగంగా ఆక్టోపస్ బృందం సభ్యులు ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఉత్తర్వుల మేరకు వీటిని నిర్వహించారు. ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ సీహెచ్ఎస్ఆర్‌సీ మూర్తి, బ్రావో టీమ్ డీఎస్పీ ఎం.చిన్నకొండయ్య ఆధ్వర్యంలో 50 మంది సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

రీ- సర్వేపై సమీక్ష


రీసర్వే సమీక్ష కార్యక్రమం

తాడేపల్లిగూడెం: పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ పరిధిలో రీ-సర్వేపై జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌లు సమీక్ష నిర్వహించారు. రీ- సర్వే ప్రక్రియ ఎంత వరకు వచ్చింది, ఏయా గ్రామాల్లో పూర్తయింది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరతిగతిన పూర్తి చేయాలని కోరారు. ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, తహసీల్దార్లు సునీల్ కుమార్, సీతారత్నం, కమిషనర్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

11న ఐఎఫ్ఎస్ కునాల్ సత్యార్థి రాక

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో రీసర్వే కార్యక్రమం జరుగుతుంది. ఈ నెల 11న 23వ వార్డులో జరగనున్న రీ- సర్వేలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డిపార్ట్మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్ (న్యూ ఢిల్లీ) జాయింట్ సెక్రటరీ ఐఎఫ్ఎస్ కునాల్ సత్యార్థి ముఖ్యఅతిథి పాల్గొంటారన్నారు. నవాబ్ పాలెం, కె.పెంటపాడు, పెంటపాడు మండలాలు కూడా పర్యవేక్షించడం, రీసర్వేలో అర్బన్ ప్రజెంటేషన్, పాత, కొత్త రికార్డులు పరిశీలన, అధికారులు సిబ్బందితో ముఖాముఖీ సమావేశం నిర్వహిస్తారని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు.

వైభవంగా రాములోరి రథోత్సవం


నందమూరు గ్రామంలో రాములోరి రథోత్సవం

తాడేపల్లిగూడెం రూరల్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నందమూరు గ్రామంలో రాములోరి రథోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ దేవులపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రథాన్ని లాగేందుకు యువత ఉత్సాహంగా ముందుకొచ్చారు. రథానికి భక్తులు స్వాగతం పలికి, పండ్లు, టెంకాయలు సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు శనగన రాంబాబు, అరసాల రాంబాబు, ముంగల సూరిబాబు, కొప్పిసెట్టి నాగేశ్వరరావు, కుంట్ల వీర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నవమి ఉత్సవాలు


ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలో కె. పెంటపాడు బైరాగిమఠంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయ ఈవో బీవీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి నిత్యార్చనలు, విశేషపూజలు, నిత్యహోమాలు, బలిహరణ, కార్యక్రమాలతో పాటు, స్వామివారికి వసంతోత్సవం, శ్రీ చక్రస్నానం, ధ్వజారోహణ, దీక్షా విరమణ, రాత్రి శ్రీ పుష్పయాగోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు త్రిలోచన దాస్, పూర్ణచంద్ర త్రిపాఠి, రామశర్మ తదతరులు పాల్గొన్నారు. చక్రస్నానం పురస్కరించుకొని పలు గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో అత్యవసర మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఈఈ కే.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మాధవరం, ఉప్పరగూడెం, తాళ్లపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

12న ప్రత్తిపాడులో శివాలయం శంకుస్థాపన

పెంటపాడు: మండలంలో ఈనెల 12న ప్రత్తిపాడులో నూతనంగా నిర్మించబోయే ప్రతిమాంబ సమేత సదాశివస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన పూజలు చేయనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆలయకమిటీ సభ్యులు కోరారు.

సుబ్బారావుపేటలో సమస్యలతో బేజారు

- చిట్టడవుల్లా ఖాళీ స్థలాలు
- ఏపుగా ఎదిగిన పిచ్చిమొక్కలు
- విషజంతువుల కలకలం
- పందుల స్వైరవిహారం


రాకెట్ పార్కు వద్ద మట్టి రోడ్డు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో సుబ్బారావుపేట 7వ వార్డులో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వ్యర్థాల సేకరణ, కాలవల్లో మురుగు తొలగింపు పనులు సక్రమంగా జరగడం లేదు. మంచి నీటి సరఫరా అధ్వానంగా ఉంది. పట్టణంలో ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న వారిలో చాలా మంది ఆ వార్డులోనే నివాసం ఉంటున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ వార్డులో మురుగు నీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం విశేషం. మునిసిపల్ కమీషనర్ క్వార్టర్ ఈ ప్రాంతంలోనే ఉంది. ఏ కమీషనర్ వచ్చినా ఇక్కడే నివాసం ఉండేవారు. అయినా వార్డులో పారిశుద్ధ్యం అంతంత మాత్రమే. వార్డులో జనాభా 3,314 మంది ఉన్నారు. పురుషులు 1,659 మంది కాగా స్త్రీలు 1,655 మంది ఉన్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు

వార్డులో ఎంతో కాలంగా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారాయి. సీసీ డ్రెయినేజీలు ఉన్నా అవి మురుగు నీరు ముందుకు పారేందుకు వీలు లేని పరిస్థితులు ఉన్నాయి. ఎక్కడ చూసిన డ్రెయినేజీల నుంచి దుర్వాసన వస్తుంది. చాలా ప్రాంతాలలో డ్రెయినేజీలు ఉన్నప్పటికి అవి నిరుపయోగంగా మారాయి. డ్రెయినేజీలకు అడ్డంగా ఆక్రమణలు ఉండటంతో మురుగు నీరు ముందుకు కదలక ఎక్కడ మురుగు నీరు అక్కడే నిలిచిపోవడం, చాలా చోట్ల ఎండిపోయాయి. పలు చోట్ల కచ్చా డ్రెయినేజీ వ్యవస్థ ఉంది. సీసీ రోడ్లు ఎత్తులోను, డ్రెయినేజీ వ్యవస్థ పల్లంగా ఉండటంతో మురుగు నీటి పారుదల వ్యవస్థ క్షీణించింది. మునిసిపల్ క్వార్టర్ ఉన్న ప్రాంతంలోనే డ్రెయినేజీ వ్యవస్థ అసలు ముందుకు సాగడం లేదు.

ఖాళీ స్థలాలు

వార్డులో చాలా ఖాళీ స్థలాలు నెలకొని ఉన్నాయి.


రాకెట్ పార్కు వద్ద వ్యర్థాలు


మునిసిపల్ క్వార్టర్ వద్ద కదలని డ్రెయిన్

పిచ్చిమొక్కలు, తుప్పలు, ఎండిన మొక్కలు, చెత్త చెదారాలు, వ్యర్థాలతో అవి నిండిపోయాయి. దీంతో పాములు బెడద పెరిగిపోయింది. ఎన్నో సంవత్సరాలుగా ఈ పరిస్థితులు అలానే ఉన్నాయి. అక్కడ అక్కడ మురుగు నీరు డ్రెయిన్‌లు ఈ ఖాళీ స్థలాల లోకి చేరడంతో అవి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో పాటు పందులు స్వైర విహారం చేస్తున్నాయి. అంతేగాకుండా దోమల బెడద ఇబ్బందికరంగా మారింది. ఎక్కడ నీటి నిల్వలు అక్కడ ఉండటంతో దోమల వృద్ధికి అవకాశాలు ఎక్కువగా కాన వస్తున్నాయి.


అస్తవ్యస్తంగా ఖాళీ స్థలం

కల్వర్టులు, సీసీ రోడ్లు

ఈ వార్డుకు అదృష్టం ఏమిటి అంటే అన్ని చోట్లు సీసీ రోడ్లు ఉన్నాయి. రాకెట్ పార్కు సమీపంలో మాత్రం రెండు మట్టి రోడ్లు ఉన్నాయి. అక్కడ అక్కడ కల్వర్టులు పాడైపోయాయి. కల్వర్టు రాళ్లు ఖాళీలు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల శిథిలమయ్యాయి. మిగిలిన మట్టి రోడ్లు వేయడంతో పాటు కల్వర్లు బాగు చేయాల్సి ఉంది. అంతేగాక కమీషనర్ క్వార్టర్స్‌కు ప్రక్కగా ఉన్న ఖాళీ స్థలంలో కళ్యాణ మండపం నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఆ నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. శిథిలావస్థకు చేరాయి.

పడిపోనున్న మునిసిపల్ స్కూల్ రెండు గదుల బిల్డింగ్


శిథిలమైన ప్రాథమిక పాఠశాలకు చెందిన పాత భవనం

స్థానిక హౌస్సేన్ జంక్షన్ వద్ద మునిసిపల్ ప్రైమరీ పాఠశాలకు సంబంధించిన రెండు చిన్న భవనాలు ఉన్నాయి. పూర్వ భవనంలో రెండు గదులు మాత్రమే ఉన్నాయి. నేడు శిథిలావస్థకు చేరింది. బిల్డింగ్ బీటలు తీశాయి. గతంలో ఈ భవనంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంను భవనం శిథిలం కావడంతో అక్కడ నుంచి మార్చారు. కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనం ప్లేస్‌లో కొత్త భవనం నిర్మాంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఏడో వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలి



పట్టణంలోని సబ్బారావుపేట 7వ వార్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి. సీసీ డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు, మురుగు నీరు ముందుకు తరలి వెళ్లే విధంగా చూడాలి. ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలి. దోమల నిర్మూలనకు తప్పక కృషి చేయాలి.

– ఇసరపు రమణ, ఏడో వార్డు, తాడేపల్లిగూడెం

మాజీ మంత్రి కొట్టు పరామర్శలు


అలజంగి బుజ్జి కుటుంసభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: పార్టీ ఆవిర్భావంలోనూ, పార్టీ ఉన్నతికి పాటుపడిన వారిని వైఎస్సార్ సీపీ తప్పక ఆదరిస్తుందని, నాయకులు, కార్యకర్తలకు సదా గుర్తుంచుకొంటామని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. రావిగుంటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అలజంగి బుజ్జి, వల్లూరుపల్లికి చెందిన పార్టీ ఎస్సీ నాయకుడు వసంతాడ జోగేంద్ర తల్లి వసంతాడ రాజామణిలు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. మృతి చెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ ఆయా గ్రామాలలో మాట్లాడుతూ రానున్న రోజులలో వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల సేవలను గుర్తుపెట్టుకొని పార్టీలో సముచిత స్థానం కల్పించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగనన్న మనకు నిత్యం తోడుగా ఉంటారన్నారు. ఈ విషయంలో నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు, పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, గోకా వెంకటేశ్వరరావు, అలజంగి దైవకుమార్, కుంచే సుబ్బన్న, ఎంపీటీసీ సభ్యులు దెయ్యం శ్రీనివాసరావు, వైస్ఎంపీపీ కొణతాల వెంకట్రావు, నాగేశ్వరరావు, సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, అన్నవరం, వల్లూరుపల్లి, రావిగుంట ప్రాంతాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేయాలి

తణుకు అర్బన్: అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడిన దివంగత సీపీఐ నేత చంద్ర రాజేశ్వరరావు ఆశయాల సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. సీపీఐ తణుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో బుధవారం తణుకు వైఎస్సార్ పార్కులోని కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు విగ్రహం వద్ద ఆయన 31వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ పీడిత, తాడిత అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, భూమి, భుక్తి కోసం శ్రమజీవుల విముక్తి కోసం బెనారస్ యూనివర్శిటీలో తన వైద్య విద్యను సైతం వదిలి కమ్యూనిస్టు ఆశయ సాధన కోసం, శ్రమ జీవుల అభ్యున్నతి కోసం తుదిశ్వాస వీడే వరకు చంద్ర రాజేశ్వరరావు పనిచేశారని కొనియాడారు. సంపన్న భూస్వామ్య కుటుంబంలో జన్మించిన చంద్ర రాజేశ్వరరావు వేలాది ఎకరాల సొంత భూములను పేదలకు పంచారని భీమారావు గుర్తు చేశారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ జీవితాంతం అణగారిన వర్గాలు, రైతులు, వ్యవసాయ కూలీల అభ్యున్నతికి శ్రమించిన చంద్ర జీవితం నేటి కమ్యూనిస్ట్ శ్రేణులకు ఆదర్శం కావాలన్నారు. అనంతరం రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, ప్రముఖ కవి కోసూరి గాంధీ, సీపీఐ నాయకులు పుట్టాఅమ్మిరాజు, బొద్దాని మురళీకృష్ణ, మందుల ముత్తయ్య, బొద్దాని కృష్ణ కిషోర్, పత్తి రాజశేఖర్ , పెన్మెత్స రాజు, సబ్బు నాగేశ్వరరావు, బొద్దాని అప్పారావు , నుడగల అప్పారావు పాల్గొన్నారు.


తణుకులో చంద్ర రాజేశ్వరరావు విగ్రహం వద్ద నినదిస్తున్న సీపీఐ నాయకులు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెన్షనర్స్‌కు రావాల్సిన డీఆర్, ఎరియర్స్, 11వ పీఆర్‌సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తాడేపల్లిగూడెం యూనిట్ అధ్యక్షుడు బి.హరికుమార్ కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కార్యాలయంలో నెలవారీ సాధారణ సమావేశం జరిగింది. పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. హరికుమార్ మాట్లాడుతూ అడిషనల్ కోంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 12 శాతం, 15 శాతం రెస్టోరేషన్ చేయించాల్సి ఉందన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్య పరీక్షలు నిర్వహించి అన్ని రకాల వ్యాధులకు వైద్య సదుపాయాలు అన్ని ఆసుపత్రులలో కల్పించాలని, మెడికల్ రీయంబర్స్‌మెంట్ రూ.2 లక్షల పరిధి నుంచి రూ.5 లక్షల పరిధికి పెంచాలని, పీఆర్‌సీ కమీషన్ ఏర్పాటు చేసేలోగా 30 శాతం ఇంటిరీయమ్ రిలీఫ్ ప్రకటించి చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో దాసం నాగేశ్వరరావు, వై.వి.సత్యనారాయణ, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, వీకే వీరారావు, ఎం.అర్జునరావు, ఎండీ ముస్తాఫా, బి.సత్యనారాయణ రాజు, కృష్ణకుమారి, రామలక్ష్మి, సుజాత, వెంకటేశ్వరరావు, తదితర సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బి.హరికుమార్

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

పెంటపాడు: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.గీతాబాయి తెలిపారు. బుధవారం పెంటపాడు, ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను అకస్మికంగా సందర్శించారు. అక్కడ డాక్టర్లు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా రెండు పీహెచ్‌సీలలో పీఎం సురక్ష ద్వారా గర్భిణులు పరీక్షలు తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. తాగునీటి శుభ్రత, క్లోరినైజేషన్ క్రమంతప్పకుండా చేయాలన్నారు. దోమల పరిరక్షణకు తీసుకొంటున్న చర్యలను అడిగారు. ఈ కార్యక్రమంలో ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి పూజిత, పెంటపాడు వైద్యాధికారిని మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.


ముదునూరు పీహెచ్‌సీలో డాక్టర్ పూజిత నుంచి వివరాలు అడుగుతున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయి

ఆసుపత్రిలు తనికీలు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని లాబరేటరీస్, ఆసుపత్రిలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గీతాబాయి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రులు, ల్యాబ్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి నుంచి మంటలాంబ అమ్మవారి ఉత్సవాలు


రేలంగిలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసిన దృశ్యం

ఇరగవరం: మండలంలోని రేలంగి గ్రామంలో మంటలాంబ జాతర ఈనెల 10తేదీ నుంచి 27వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గతంలో గొడవలు దృష్ట్యా మంటలాంబ జాతర జరుగుతున్న ప్రాంతమంతా ఎస్సై జానా సతీష్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ అన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్సై జానా సతీష్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొంతమంది మతాలను అడ్డుపెట్టుకుని అల్లర్లు అలజడులు సృష్టించడానికి ప్రయత్నం చేస్తున్నారని, వాటిని దృష్టిలో పెట్టుకుని జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతీ చోట సీసీ కెమెరాలు ఉండటంతో ఏచిన్న సంఘటన జరిగినా వెంటనే స్పందించి దానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవడం జరగుతుందన్నారు.

వంట గ్యాస్ ధరలు తగ్గించాలి


తాడేపల్లిగూడెం(టీఓసీ): గ్యాస్ బండతో వినూత్న నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: ఒక్కసారిగా వంట గ్యాస్ ధరలు రూ.50లు పెంచడం దారుణమని సీపీఎం మండల నాయకుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని నవాబుపాలెం అంబేద్కర్ సెంటర్‌లో గ్యాస్ సిలిండర్‌తో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంతో అంటకాగుతున్న కూటమి ప్రభుత్వం ప్రతినిధులు నోరు విప్పకపోవడం సరికాదన్నారు. పెంచిన గ్యాస్ ధరను తగ్గించకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సీపీఎం నాయకులు కండెల్లి రమేష్‌బాబు, కే.విజయ, రుద్ర సత్తమ్మ, ఉండ్రాజవరపు కుమారి, కండెల్లి కుమారి, పి. సుజాత, ఉండ్రాజవరపు మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు మోపుతున్న మోదీ ప్రభుత్వం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపడం దుర్మార్గమని సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద గ్యాస్ బండాను మోస్తు వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ గృహావసరాలకు వినియోగించే సిలిండర్ల ధరల రూ. 50లు పెంచడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఏపీ ప్రజలపై మరింత భారాలు పెంచే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వైపు నిత్యావసర వస్తువుల అధిక ధరలతో ఇబ్బంది పడుతుంటే, మరిన్న భారాలు ఏమిటి అని ప్రశ్నించారు. అమెరికా భారత్ ప్రభుత్వంపై విధించిన 26 శాతం టారిఫ్ అనుగుణంగా ప్రజలపై తక్షణం ధరలు పెంచాలనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. పట్టణ కమిటీ సభ్యులు జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, నరమాల కృష్ణ, శిద్ధిరెడ్డి శేషు, యడవల్లి వెంకట దుర్గారావు, తోట శ్రీను, పతివాడ నాగేంద్ర బాబు, రావి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం(రూరల్): నవాబుపాలెం గ్రామంలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


ఇరగవరం: రేలంగిలో గ్యాస్ ధరను తగ్గించాలని నిరసన తెలుపుతున్న మహిళా సంఘ సభ్యులు

గ్యాస్ ధరను తగ్గించాలని నిరసన

ఇరగవరం: పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని కోరుతూ మహిళా సంఘం ఆధ్వర్యంలో రేలంగి గ్రామంలో బుధవారం గ్యాస్ బండలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కామన మునిస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలపై ఎటువంటి భారాలు మోపమని వాగ్దానం చేసిందని, ప్రభుత్వం ప్రజలకు మూడు గ్యాస్ బండలను ఉచితంగా ఇస్తామని ఎన్నికల వాగ్దానం చేశారన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఇంత వరకు ఒక్క రూపాయి కూడా గ్యాస్ డబ్బులు వేయలేదన్నారు. బీజేపీ ప్రభుత్వానికి మద్దతిస్తున్న కూటమి ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 పెంచిన మాట్లాడపోవడం దారుణమని మునిస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం గ్యాస్ ధరను తగ్గించాలని, లేకపోతే మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యనారాయణ, నేలపు ఆంజనేయులు, నీలాపు యేసుచిన్న, నీలాపు లక్ష్మీ, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పట్టణంలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని, ఆరోగ్య నియమాలను పాటించుట ద్వారా ఆరోగ్య భద్రత సాధిద్దామని పట్టణ సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలైన కడకట్ల, యాగర్లపల్లిలోని 22, 23, 31, 32 వార్డులలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాల అమలు, కీటకజనిత వ్యాధులపై బుధవారం అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికొకసారి డ్రై డే పాటించాలని, దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరు అవగాహనతో ఉండాలన్నారు. దోమ తెరలను తప్పక వాడాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రమణ, సరస్వతి, జ్యోతి, పద్మ, అంగన్వాడీ సిబ్బంది, ఆశాలు జ్యోతి, వెంకట లక్ష్మి, ఆరోగ్య సహాయకులు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

భీమవరం: ఉభయ గోదావరి జిల్లాలను ఆక్వా క్యాబ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రగల్భాలు పలికారని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడు స్వభావంతో ఆక్వారంగం కుదేలవుతుందని ఆయన విమర్శించారు. చంద్రబాబునాయుడు వాణిజ్య పంటలు పండించి విదేశాలకు ఎగుమతులు చేసే విధంగా రైతాంగం నిలబడాలని పిలుపునిచ్చారన్నారు. ఇప్పుడు ఆక్వా రైతులు రోడ్డున పడితే కనీసం పట్టించుకోకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని నెత్తిన పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

పాలకోడేరు : గర్భిణులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పాలకోడేరు ప్రాథమిక వైద్యాధికారి సీహెచ్ వి.రంగనాయుడు అన్నారు. ప్రతి నెలా 9వ తేదీన నిర్వహించే ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా సుమారు 60 మంది గర్భిణులకు రక్త పరీక్షలు చేయించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పేరు నమోదు చేయించుకోవాలని, ఆ గ్రామంలో ఉన్న ఏఎన్ఎంకు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా మొదటి నుంచి వైద్య పరీక్షలు చేయించుకోవడం వలన తల్లీ, బిడ్డకు ఏమైనా సమస్యలు ఉంటే తెలుస్తుందని, తద్వారా తగిన వైద్యం పొందుతే ప్రసవ సమయంలో ఏ విధమైన ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్ఓ సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు హెచ్‌వీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.